## క్లుప్తంగా

### ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు

**జగిత్యాల:** ప్లాస్టిక్ వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించినట్లు మున్సిపల్ కమిషనర్ స్పందన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగించినా, నిబంధనలు ఉల్లంఘించినా వారిపై జరిమానా విధిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అలాగే మున్సిపాలిటీల్లో వ్యాపారం చేస్తున్న ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని పురపాలక ఆదాయ వృద్ధిలో లైసెన్స్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. వార్డు ఆఫీసర్లకు యజమానులు సహకరించాలన్నారు. ఆమె వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, అధికారులున్నారు.

### అర్హులందరికీ లేబర్‌కార్డులివ్వాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

**జగిత్యాల/జగిత్యాలటౌన్:** అర్హులైన కుటుంబాలందరికీ లేబర్ కార్డులివ్వాలని తెలంగాణ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, గౌరవ అధ్యక్షుడు కిరణ్, వెన్న మహేశ్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఈనెల 21, 22న జరిగే మహాసభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. బయట రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికుల వల్ల స్థానిక లేబర్లకు ఉపాధి దెబ్బతింటుందన్నారు. స్థానిక కార్మికులకు ప్రభుత్వ నిర్మాణ రంగంలో పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివప్రసాద్, రాంబాబు, మల్లేశం,మల్లిక్, ప్రతాప్ పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలలో చేరండి


కోనాపూర్‌లో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

**సారంగాపూర్:** ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని సారంగాపూర్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల పదో తరగతి రాసిన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి ప్రచారం చేశారు. మండలంలోని పెంబట్ల, కోనాపూర్, పోచంపేట, లక్ష్మీదేవిపల్లి, బట్టపల్లి, పోతారం, సారంగాపూర్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి మాట్లాడారు. వారి పిల్లలను చేర్పించాలని కోరారు. ఇంటర్‌లో ఉత్తమ విద్య అందించడంలో కళాశాలకు మంచి పేరుందన్నారు. విద్యార్థులకు అన్ని మౌలిక వసతులతో పాటు ల్యాబ్, గ్రంథాలయం, అన్ని సబ్జెక్టులకు నిష్ణాతులైన అధ్యాపకులు బోధిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వై. రమేశ్ బాబు, అధ్యాపకులు శ్రీధర్, రాజు, రాజేందర్, సౌజన్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్

**జగిత్యాల:** జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు శనివారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ సెల్ సాన్ బిజినెస్ సొల్యూషన్స్ ఆధ్వర్యంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐఫోన్ మ్యానుఫ్యాక్చరింగ్ కంపెనీలో ఆపరేటర్స్ ఉద్యోగాల కోసం ఈ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్వ విద్యార్థులు, ప్రస్తుత తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఐఫోన్ కంపెనీలో ఉద్యోగాలు చేయాల్సి ఉంటుందని, అన్ని సౌకర్యాలుంటాయని తెలిపారు.

### ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

**ఇబ్రహీంపట్నం:** మండలంలోని వర్షకొండ ప్రాథమిక పాఠశాలలో గురువారం రాత్రి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం విజయభాస్కర్, ఎస్ఎంసీ చైర్మన్ గంగాధర్, మాజీ ఎంపీటీసీ వెంకట్, తుక్కారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి**

**జగిత్యాల:** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో సైతం ఉండాలని సరస్వతి శిశుమందిర్ ప్రిన్సిపాల్ రాజేందర్ అన్నారు. శుక్రవారం జగిత్యాల సరస్వతి శిశు మందిర్‌లో 55 మంది విద్యార్థులకు కరాటే బెల్ట్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో పాల్గొంటే మానసిక ఉల్లాసంతో పాటు కరాటే ఆత్మరక్షణకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మద్రిపల్లి లింగయ్య, తిరుమల నరేశ్, సందీప్‌రావు పాల్గొన్నారు.


### శ్రీరేణుకా ఎల్లమ్మ ప్రతిష్ఠాపనోత్సవాలు

**సారంగాపూర్:** బీర్‌పూర్ మండలం రేకులపల్లిలో గౌడసంఘం, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్మితమైన శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అర్చకులు వొద్దిపర్తి మధుకుమార్ చార్యులు ప్రత్యే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి శోభాయాత్రలో భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.


### శ్రీ గండి వేంకటేశ్వరస్వామి శోభాయాత్ర

**సారంగాపూర్:** మండలంలోని రేచపల్లి శ్రీ గండి వేంకటేశ్వరస్వామి ప్రతిష్ఠాపనోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయ శిఖరం, శ్రీ అభయాంజనేయస్వామి శోభాయాత్ర నిర్వహించారు. శోభాయాత్రలో భాగంగా గ్రామంలో అభయాంజనేయస్వామి, ఆలయ శిఖరాన్ని ట్రాక్టర్‌ను పూలతో అలంకరించి ఊరేగించారు. ఒగ్గు కళాకారులు, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంబులెన్స్ ఏర్పాటు అభినందనీయం

**ధర్మపురి:** పేదప్రజల కోసం అంబులెన్స్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మంథని సీతారామ సేవాసదన్ సౌజన్యంతో ధర్మపురిలోని బ్రాహ్మణ సంఘ గాయత్రి నిత్య అన్నదాన సత్రం అన్నపూర్ణ సేవాసమితి నిర్వాహణలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబులెన్సును శుక్రవారం విప్ ప్రారంభించి మాట్లాడారు. దాతలు సమకూర్చిన అంబులెన్స్ ధర్మపురి పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో బాధితుల సౌకర్యార్థం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే గోదావరిలో కలుషిత నీరు కలవకుండా సీవరేజ్ ప్లాంటు ఏర్పాటు కోసం కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.


అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సంగి సత్తమ్మ, నాయకులు ఎస్.దినేశ్, ఇందారపు రామయ్య, డాక్టర్ రామకృష్ణ, కాసర్ల వెంకటరమణ, నరేందర్ తదితరులున్నారు.

# కేంద్రం రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోంది

**కోరుట్ల/కోరుట్ల రూరల్:** బీజేపీ ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చేయాలని చూస్తుందని కాంగ్రెస్ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని సంగెం, నాగులపేట గ్రామాల్లో, కోరుట్ల పట్టణంలో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అంబేడ్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు పూల మాలలు వేసి ప్రతిజ్ఞ చేశారు. పార్లమెంట్ సాక్షిగా అంబేడ్కర్‌ను అవమానించిన కేంద్ర మంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుంచి తొలగించాలన్నారు. కార్యక్రమంలో కోరుట్ల అసెంబ్లీ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ కత్తి వెంకట స్వామి, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, మహిళా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షురాలు కవిత, ఏఎంసీ చేర్మెన్ అంజయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**మల్లాపూర్ :** మండలంలోని గొర్రెపల్లి, వేంపల్లి, వెంకట్రావ్‌పేట, రేగుంట గ్రామాలలో కాంగ్రెస్ మండలశాఖ ఆధ్వర్యంలో 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' పాదయాత్ర చేపట్టారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


సంగెంలో పాదయాత్ర చేస్తున్న నాయకులు

**కథలాపూర్:** మండలంలోని కలిగోటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం

**మల్లాపూర్:** మండలంలోని ముత్యంపేటలో నీలగిరి పెద్దమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా నీలగిరి మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాల్గొండ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా దారవేణి వెంకటేశ్, కార్యవర్గ సభ్యులుగా దారవేణి అశోక్, దారవేణి రవి, కోశాధికారిగా దారవేణి జీవన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సలహాదారుగా దారవేణి శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. జాతర ఉత్సవాలు విజయవంతంగా పూర్తిచేసేందుకు కమిటీ పనిచేస్తుందని పేర్కొన్నారు.

### వేంకటేశ్వర ఆలయ కమిటీ నియామకం

**కోరుట్ల:** పట్టణంలోని అతి పురాతన శ్రీ వెంకటేశ్వర ఆలయ కమిటీని నియమిస్తూ కరీంనగర్ ఎండోమెంట్ సూపరింటెండెంట్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడుగురు సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేశారు. కమిటీ సభ్యులుగా ఎతిరాజం నర్సయ్య, నేతి శ్రీనివాస్, కటుకం దివాకర్, కొత్త గంగాదర్, గొడికె రాములు, చిలివేరి విజయ్ కుమార్, చిట్యాల పద్మను నియమించారు. నూతనంగా నియామకమైన ఈ ఏడుగురు సభ్యులు ఆలయ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. నూతన కమిటీకి పలువురు అభినందనలు తెలిపారు.

# కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**రాయికల్:** రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రాయికల్ సింగిల్ విండో చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి కోరారు. మండలంలోని రామాజీపేట, మూటపల్లి, కొత్తపేట గ్రామాల్లో శుక్రవారం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బేతి మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు, నాయకులు, ఇన్‌చార్జి సీఈవో కట్కం జగదీశ్, సెంటర్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

**ధర్మపురి :** మండలంలోని ఆరెపెల్లి, మగ్గిడి, దొంతాపూర్ గ్రామాల్లో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను జైనా పీఏసీఎస్ చైర్మన్ సొల్ల నరేశ్,ఏఎంసీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మన్ ప్రారంభించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం వరి ధాన్యం ఏ గ్రేడుకు రూ. 2320, బి గ్రేడుకు 2300 ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు సత్తయ్య, జలపతి, ఏఎంసీ డైరెక్టర్లు రఫియోద్దీన్, అశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న చైర్ పర్సన్

### ప్రభుత్వం మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి

**జగిత్యాలరూరల్:** ప్రభుత్వం మల్టీపర్పస్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని కారోబార్ల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగమల్లయ్య, ప్రధాన కార్యదర్శి ఆకుల కిరణ్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 51 మల్టీపర్పస్ విధానం వల్ల ఏ కేటగిరి వారిని ఆ కేటగిరికి కేటాయించాలని ప్రభుత్వం కోరినట్లు తెలిపారు. గతంలో ఏ హోదాలో ఉందో దాని ప్రకారమే అనుకున్న నిర్ణయం తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. 51 జీవోతో ఎందరో ప్రాణాలు కోల్పోవడం జరిగిందని, వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకుని రూ.20 లక్షల పరిహారం ఇవ్వడంతో పాటు వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పోతు సురేశ్, ఉరుమల్ల ప్రశాంత్, భరణి, గంగాధర్, మల్లేశం, రాములు, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

### 'అహంకార పూరితంగా 'అద్దంకి' వ్యాఖ్యలు'

**జగిత్యాల:** మోదీ, అమిత్‌షాలపై ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అసభ్యంగా మాట్లాడటం అహంకారానికి నిదర్శనమని బీజేపీ అధికార ప్రతినిధి సత్యం, ప్రధాన కార్యదర్శి రాగిల్ల సత్యనారాయణ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దయాకర్ మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ బ్రిటిష్ వారు వేసిన బీజమేనని విమర్శించారు. సుబ్రమణ్యస్వామి నేషనల్ హెరాల్డ్ మీద ల్యాండరింగ్ కేసు వేయగా ఈడీ విచారణ జరుపుతోందని, అందులో సోనియా, రాహుల్ పాత్ర ఉందని ఈడీ చార్జిషీట్ దాఖలు చేసిందన్నారు. మోదీకి, అమిత్‌షాకు ఏం సంబంధమని ప్రశ్నించారు. వారి తప్పులేకుంటే కోర్టులో తేల్చుకోవచ్చాన్నరు. కార్యక్రమంలో దశరథరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### నృసింహుడిని దర్శించుకున్న రాష్ట్ర ఫైనాన్స్ కంట్రోలర్


స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు అందిస్తున్న అధికారులు

**ధర్మపురి:** ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని శుక్రవారం రాష్ట్ర ఫైనాన్స్ కంట్రోలర్ వెంకన్న స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా దేవస్థానం స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ స్వామివారి శేషవస్త్రం, చిత్ర పటం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో సీతామహాలక్ష్మి, ఆలయ అర్చకులు నంబి శ్రీనివాస్ సిబ్బంది తదితరులున్నారు.

**ఆలయం పక్షాన పట్టువస్త్రాలు, తలంబ్రాలు**



**ధర్మపురి:** ధర్మపురి గోదావరి తీరానున్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం పక్షాన శుక్రవారం పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ఈవో శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్ సమర్పించారు.

### వీధి వ్యాపారులకు గొడుగులు పంపిణీ

**జగిత్యాలటౌన్:** శ్రీసత్యసాయి బాబా వారి ఆరాధనా మహోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని వీధి వ్యాపారులకు సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్ మాట్లాడుతూ చిరువ్యాపారులకు ఎండా,వానకు రక్షణ కల్పించేలా శ్రీసత్యసాయి ఆశీస్సులతో గొడుగులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో తాటిపర్తి దశరథరెడ్డి, ఊటూరి శివకుమార్, సామ సునీల్, గణపతి నరేందర్‌రాజు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ..**


**ధర్మపురి:** ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న ఇద్దరికీ సీఎం సహాయ నిధి ద్వారా 4.35 లక్షల రూ.ల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని జైనా గ్రామానికి చెందిన సంగెపు సుశీల, బర్ల శ్రీనివాస్‌కు నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కుంట సుధాకర్ అందించారు. కార్యక్రమంలో నాయకులు కట్ట భువనేశ్వర్, కట్ట లక్ష్మణ్, కొరుట్ల శ్రీనివాస్, చిలువేరు సత్తయ్య, రాజన్న, తిరుపతి పాల్గొన్నారు.

### కాంగ్రెస్ నాయకుల పల్లె నిద్ర



**కోరుట్ల రూరల్:** మండలంలోని సంగెంలో కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో నాయకులు గురువారం రాత్రి పల్లె నిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా దళితవాడలో సన్న బియ్యం వంటతో కాలనీ వాసులతో కలిసి జువ్వాడి కృష్ణా రావు సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొంతం రాజం, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు నాయిని సురేష్, కిసాన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

### వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన


జగిత్యాలలో నిరసన తెలుపుతున్న ముస్లిం

**జగిత్యాలటౌన్:** ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం జగిత్యాల పట్టణంలోని ముస్లిం ప్రార్థనామందిరాల వద్ద నల్ల రిబ్బన్లు ధరించి శాంతియుతంగా నిరసన తెలిపారు. వక్ఫ్ సవరణ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

**కోరుట్లలో..**

**కోరుట్ల:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లింలు శుక్రవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో మౌజన్లు,ఇమామ్‌లు, మౌలానాలు, మత పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



**జగిత్యాలటౌన్:** పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలోని చేపల మార్కెట్ లోపల వాహనాలు పార్క్ చేస్తుండటంతో చేపల కోసం వచ్చే వారు ఇబ్బంది పడుతున్నారు. స్థలం లేక చేపలు కొట్టే వారికి అతి సమీపంలో నిలబడుతుండటంతో వ్యర్థాలు వారిపై పడుతూ దుస్తులపై మరకలు పడుతున్నాయని అంటున్నారు. కొనుగోలు దారుల కోసం నిర్మించిన షెడ్డు మొత్తం వాహనాలతో నిండిపోవడంతో స్థలం లేక ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. ఇది చేపల మార్కెట్టా లేక వాహనాల పార్కింగా అంటూ ప్రశ్నిస్తున్నారు. బల్దియా అధికారులు స్పందించి వాహనాలు బయట పార్కింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి: స్పందన
కమిషనర్, జగిత్యాల బల్దియా : 9849905877

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

# పేద వెలమ కులస్తులకు ఆర్థిక భరోసా

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

**జగిత్యాల:** నిరుపేద వెలమ కులస్తులకు అండగా ఉండాలని, వారికి ఆర్థిక భరోసా కల్పించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఇటీవల ప్రమాదంలో మృతిచెందిన గండ్ర వంశీధర్‌రావు పిల్లల సహాయార్థం పద్మనాయక సంఘం ఆధ్వర్యంలో రూ.4 లక్షల ఫిక్స్‌డ్ బాండ్‌ను అందజేశారు. అలాగే ఎమ్మెల్యే రూ.25 వేలు, డాక్టర్ వేణుబాబు రూ.25 వేలు, రమణారావు రూ.10 వేలు, అల్లీపూర్ పద్మనాయక సంఘం నుంచి రూ.34 వేలు, నాచుపల్లి పద్మనాయక సంఘం నుంచి రూ.31 వేలు అందజేశారు. అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు, వేణుగోపాల్‌రావు, కృష్ణారావు, కమలాకర్‌రావు, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.


ఫిక్స్‌డ్ బాండ్ అందించిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

**కుటీర పరిశ్రమలకు 25 హెచ్‌పీ విద్యుత్**

**జగిత్యాల:** విశ్వకర్మల కుటీర పరిశ్రమలను గుర్తించి ప్రజాప్రభుత్వం 25 హెచ్‌పీ కెపాసిటి వరకు విద్యుత్ వాడుకునేలా రూపకల్పన చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. శుక్రవారం అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వకర్మల కుటీర పరిశ్రమలకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 10హెచ్‌పీ కరెంట్ కనెక్షన్లు ఇవ్వడం జరిగిందని, కాలానుగుణంగా నూతన పరికరాలు రావడంతో 10 హెచ్‌పీ సరిపోవడం లేదని, సీఎం రేవంత్‌రెడ్డి 25 హెచ్‌పీ కెపాసిటి వరకు వాడుకునేలా రూపకల్పన చేయడం జరిగిందన్నారు. పరిషత్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్వర్, రాకేశ్, సాయి, రంజిత్ పాల్గొన్నారు.

**ఎల్‌వోసీ అందజేత**

పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన చిట్ల మల్లీశ్వరికి నిమ్స్ ఆస్పత్రిలో కంటికి సంబంధించిన శస్త్ర చికిత్స జరగగా, స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆమెకు రూ.40 వేల విలువ గల ఎల్‌వోసీని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అందజేశారు.

### ఉరేసుకుని వ్యక్తి మృతి

**జగిత్యాలక్రైం:** జిల్లా కేంద్రంలోని బీట్‌బజార్ ప్రాంతానికి చెందిన నాంపల్లి వేణు (35) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీట్‌బజార్‌కు చెందిన వేణు తల్లి గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా దీంతో తల్లి ఆరోగ్యం బాగు కావడం లేదని మద్యానికి బానిసయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన వేణు గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పద్మజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై మన్మథరావు తెలిపారు.

**చికిత్స పొందుతూ యువకుడు..**

**కోరుట్ల రూరల్:** పట్టణ పరిధిలోని యెఖీన్‌పూర్ గ్రామానికి చెందిన ఆరెల్లి అజయ్ (22) అనే యువకుడు గురువారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యయత్నం చేయగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. యెఖీన్‌పూర్‌కు చెందిన ఆరెల్లి వెంకట స్వామికి భార్య పద్మ, ముగ్గురు కుమారులు ఉన్నారు. అజయ్ పెద్ద కుమారుడు హైదరాబాద్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తల్లి పద్మ గత కొన్నేళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతూ చికిత్స తీసుకుంటుంది. ఈ క్రమంలో తల్లి పద్మ తరచూ పడని పదార్థాలు తింటుందని రెండు రోజుల క్రితం తండ్రి వెంకటి తల్లి పద్మను కొట్టాడు. దీంతో మనస్థాపానికి గురైన అజయ్ గురువారం పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే కోరుట్లకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్ తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందాడు. తండ్రి వెంకటి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**ఉడిపి హోటల్ నిర్వాహకుడు..**

**జగిత్యాలక్రైం:** జిల్లా కేంద్రంలోని తహసీల్ చౌరస్తా ప్రాంతంలో 40 ఏళ్లుగా గణేశ్ భవన్ ఉడిపి హోటల్ నిర్వహిస్తున్న నిర్వాహకుడు విఠల్‌శెట్టి శుక్రవారం మృతి చెందాడు. ఆయన మృతి పట్ల కళాశ్రీ అధినేత గుండేటి రాజు, ఉపాధ్యాయ సంఘం నాయకులు అలిశెట్టి రాజు, కందుకూరి నాగరాజు, న్యాయవాది బూసారపు శ్రీనివాస్‌గౌడ్ పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

### వాక్సినేషన్ గది దగ్ధం


వాక్సినేషన్ గదిలో కాలిపోయిన ఫ్రిడ్జ్‌లు

**కథలాపూర్:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వాక్సినేషన్ గది శుక్రవారం సాయంత్రం దగ్ధమైంది. షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగినట్లు వైద్యాధికారులు పేర్కొన్నారు. షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగడంతో వాక్సిన్ నిల్వలు ఉంచే గదిలోని నాలుగు ఫ్రిడ్జ్‌లు కాలిపోయి అందులో ఉన్న వాక్సిన్‌లకు నష్టం జరిగిందన్నారు. రెండు ఇన్వర్టర్లు కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో సుమారు రూ. 25 లక్షలు నష్టం జరిగినట్లు వైద్యాధికారి సింధూజ పేర్కొన్నారు.

### యువకుడి అదృశ్యం

**గొల్లపల్లి:** మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన చిట్యాల గణేశ్ అనే యువకుడు గురువారం నుంచి కన్పించడం లేదని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

**ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన లారీ**

**కోరుట్ల:** పట్టణంలోని అల్లమయ్య గుట్ట వద్ద శుక్రవారం ఓ లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. వివరాల్లోకి వెళితే కథలాపూర్ నుంచి కోరుట్ల వైపు వస్తున్న లారీ కోరుట్ల శివారు అల్లమయ్య గుట్ట వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ యువకుడిని ఢీకొట్టింది. యువకుని స్వల్ప గాయాలయ్యాయి. డ్రైవర్ లారీ వదిలి పారిపోయాడు. యువకుడి తండ్రి పల్లెర్ల లవన్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు, కాగా లారీ డ్రైవర్ కథలాపూర్ నుంచి వస్తుండగా మార్గ మధ్యలో రెండు చోట్ల యాక్సిడెంట్ చేశాడని తెలిసింది.